సాక్షి బాపట్ల

ఆదివారం । 29 । జనవరి । 2023



పులిచింతల నీటి నిల్వ

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టు ప్రస్తుత నీటి నిల్వ 42.2760 టీఎంసీలు ఉండగా ప్రాజెక్టు దిగువకు 4,200 క్యూసెక్కులు వదులుతున్నారు.



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్: కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద శనివారం 2,519 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. కొమ్మమూరు కాలువకు 1,410 క్యూసెక్కులు నీటిని విడుదల చేశారు.

కరోనా జీరో



గుంటూరు మెడికల్: జిల్లా వ్యాప్తంగా శనివారం కరోనా పాజిటివ్ కేసు ఒక్కటి కూడా నమోదు లేదు. జిల్లాలో ఎక్కడా కరోనా మరణాలు సంభవించలేదు.

న్యూస్‌రీల్

దోచుకుంటున్న రైస్‌మిల్లు!

- సివిల్ సప్లయ్ డీఎం జోక్యంతో రైతు వద్ద తీసుకున్న నగదు వెనక్కి



బాపట్లటౌన్: ధాన్యం కొనుగోళ్లలో దళారుల ప్రమేయం లేకుండా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చర్యలు చేపట్టినప్పటికీ కొందరు మిల్లర్లు తమ చేతివాటాన్ని ప్రదర్శిస్తూనే ఉన్నారు. ముత్తాయపాలెం గ్రామానికి చెందిన రైతులు పమిడిబోయిన జడంకయ్య, పమిడిబోయిన మాధవి గ్రామంలోని ఆర్బీకేలో తేమ శాతాన్ని పరీక్షించుకొని తమ ధాన్యాన్ని గోతాల్లో నింపుకున్నారు. శనివారం బాపట్లలో హేబ్రిడ్జి వద్ద ట్రక్ షీట్ జనరేట్ చేయించారు. 40 కిలోల గోతాలు 182 బస్తాల ధాన్యం కొల్లూరులోని సాయికృష్ణ అగ్రో ఇండస్ట్రీస్ రైస్‌మిల్‌లో దించాలని అధికారులు సూచించారు. సాయంత్రం 3:40 గంటలకు రైతు తన ధాన్యంతో మిల్లుకు చేరుకున్నాడు. బస్తాకు 2 కిలోల తరుగు చొప్పున బస్తాకు రూ.41 చొప్పున 182 బస్తాలకు రూ.7,462 చెల్లిస్తేనే ధాన్యం దించుకుంటామని, లేకుంటే తిప్పి తీసుకెళ్లాలన్నారు. 60 కిలోమీటర్లు ప్రయాణం చేసి తీసుకొచ్చామంటూ ప్రాధేయపడినప్పటికీ సుముఖత చూపలేదు. చివరకు రూ.3,500 అప్పు తీసుకొచ్చి చెల్లించిన తర్వాత ధాన్యాన్ని దించారు. ఈ విషయాన్ని సాక్షి జిల్లా సివిల్ సప్లయ్ మేనేజర్ వి.శ్రీలక్ష్మి దృష్టికి తీసుకెళ్లడంతో రైస్ మిల్లు యజమానితో మాట్లాడి రైతుకు నగదు తిరిగి ఇప్పించారు. ఈ విషయంపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని డీఎం వి.శ్రీలక్ష్మి తెలిపారు.

డీజిల్ సరఫరాకు టెండర్ల ఆహ్వానం

బాపట్లటౌన్: జిల్లాలోని ఏపీఎస్ ఆర్టీసీ పరిధిలోని అద్దంకి, బాపట్ల, చీరాల, రేపల్లె డిపోలకు డీజిల్ సరఫరా నిమిత్తం టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ప్రజా రవాణాధికారి విజయ్‌కుమార్ రెడ్డి తెలిపారు. టెండర్ ఫారం ఈ నెల 30 నుంచి ఫిబ్రవరి 6వ తేదీ వరకు జిల్లా ప్రజా రవాణాధికారి కార్యాలయంలో అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. పూర్తి చేసిన టెండర్ ఫారాలను సీల్డ్ బాక్స్‌లో వేయాలన్నారు. ఫిబ్రవరి 6న సాయంత్రం 3 గంటలకు టెండర్లు ఓపెన్ చేయడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని ప్రైవేట్ డీజిల్ బంక్‌ల డీలర్లు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేయాలి

జేసీ శ్రీనివాసులు



వేటపాలెం: జగనన్న లే అవుట్‌లో ఇళ్ల నిర్మాణాలు వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను జేసీ శ్రీనివాసులు ఆదేశించారు. మండల పరిధిలోని బచ్చులవారిపాలెం రోడ్డులోగల కొణిజేటిపురి జగనన్న కాలనీలో నూతన లేఅవుట్‌లో ఇళ్ల నిర్మాణాలను జేసీ శనివారం పరిశీలించారు. జేసీ మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించిన లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని సూచించారు. అటువంటి వారికి ఆర్థిక ఇబ్బందులు ఉంటే మహిళ సంఘాల ద్వారా తక్కువ వడ్డీలకు రుణాలు అందించే విధంగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కాలనీల్లో మౌలిక వసతులు కల్పనకు చర్యలు చేపట్టాలని తెలిపారు. వీరి వెంట హౌసింగ్ డీఈ గోవిందరెడ్డి, ఏపీఎం శ్రీనివాసరావు, దేశాయి పేట సెక్రటరీ శ్రీనివాసరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సెబ్ అసిస్టెంట్ కమిషనర్‌గా సుర్జిత్‌సింగ్ నియామకం

బాపట్లటౌన్: బాపట్ల జిల్లా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్) అసిస్టెంట్ కమిషనర్‌గా సుర్జిత్‌సింగ్‌ను నియమిస్తూ ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. విజయవాడలో అసిస్టెంట్ కమిషనర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న సుర్జిత్‌సింగ్ బదిలీపై రానున్నారు.

బాపట్లకు మెడికల్ కళాశాల వరం

- నాబార్డు నిధులతో పనులు వేగవంతం
- మెడికల్ కాలేజీ శంకుస్థాపనలో ఎమ్మెల్యే కోన రఘుపతి



మెడికల్ కళాశాలకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కోన రఘుపతి

బాపట్ల: బాపట్లకు మెడికల్ కళాశాల ఓ వరం లాంటిదని ఎమ్మెల్యే కోన రఘుపతి పేర్కొన్నారు. మెడికల్ కళాశాల శంకుస్థాపన పనులు శనివారం చేపట్టారు. భూమి పూజ చేపట్టి శంకుస్థాపన చేశారు. బాపట్ల ప్రాంతంలో వైద్య సదుపాయం లేక ప్రజలు అల్లాడిపోతుంటే హాస్పటల్ నిర్మాణం కావాలని కోరితే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏకంగా వైద్య కళాశాలనే మంజూరు చేశారని కోన తెలిపారు. కేంద్ర ప్రభుత్వం మెడికల్ కళాశాల నిర్మాణానికి అనుమతులు ఇచ్చే విషయంలో కొద్దిగా జాప్యం జరగ్గా, కొంతమంది వాటిని సాకుగా చూపి మెడికల్ కళాశాల వెనుక్కు పోయిందని ప్రచారం చేశారన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, నాబార్డ్ చైర్మన్ చింతల చొరవతో బాపట్ల కళాశాలను స్టేజ్–2లో పొందుపరచడం జరిగిందన్నారు. బాపట్ల ప్రాంతంలో 1981లో కోన ప్రభాకర్‌రావు ఇంజినీరింగ్ కళాశాలతో ఈ ప్రాంత అభివృద్ధికి కృషి చేయగా, ప్రస్తుతం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చొరవతో మెడికల్ కళాశాల వచ్చిందన్నారు. మెడికల్ కళాశాల కోసం 57 ఎకరాల భూమిని ఉచితంగా ఇచ్చిన సూర్య సత్యనారాయణ రాజుకు కృతజ్ఞతలు తెలిపారు. రూ.510 కోట్లతో చేపట్టిన బాపట్ల మెడికల్ కళాశాలకు సాంకేతిక పరిజ్ఞానాన్ని జోడించి వేగంగా నిర్మాణ పనులు చేపట్టాలని కాంట్రాక్టర్లకు సూచించడం జరిగిందన్నారు. బాపట్ల మెడికల్ కళాశాలతో జిల్లాలోని ప్రజలకు మెరుగైన వైద్య సదుపాయం అందుతుందన్నారు. మెడికల్ కళాశాల నిర్మాణంతో రైలుపేట మొత్తం అభివృద్ధి చెందుతుందని చెప్పారు.

మ్యాప్‌ల పరిశీలన..

మెడికల్ కళాశాలకు సంబంధించిన మ్యాపులను ఎమ్మెల్యే కోన రఘుపతి పరిశీలించారు. అనుమతుల మ్యాపులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కోన రఘుపతి సతీమణి రమాదేవి, పార్టీ మండల అధ్యక్షుడు కోకి రాఘవరెడ్డి, దొంతి రెడ్డి, సీతారామరెడ్డి, డీఈ భాగ్యలక్ష్మి, ఏఈ సతీష్, నాయకులు కన్నా మామిడి, కొత్త లక్ష్మీనారాయణ, జోగి రాజా, వడ్డీముక్కల డేవిడ్, ఎంపీపీ చిన్న పోతుల హరిబాబు, ఎంపీడీవో రాధాకృష్ణ పాల్గొన్నారు.

న్యాయం పొందడం ప్రజల కనీస హక్కు

జిల్లా ప్రధాన న్యాయమూర్తి పార్థసారథి



గుంటూరు వెస్ట్: అర్హులైన ప్రజలకు ఉచిత న్యాయ సేవలు అందించడం మన కర్తవ్యమని జిల్లా ప్రధాన న్యాయమూర్తి వైవీఎస్‌బీ పార్థసారథి తెలిపారు. శనివారం కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో నిర్వహించిన న్యూ మాడ్యూల్ లీగల్ సర్వీస్ క్యాంప్‌కు ముఖ్య అతిథిగా విచ్చేసిన పార్థసారథి మాట్లాడుతూ ప్రజలకు చట్టాలపై కనీస అవగాహన ఉంటే వారికి రాజ్యాంగం ద్వారా సంక్రమించిన హక్కులను పొందుతారన్నారు. జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి మాట్లాడుతూ అర్హులకు రేషన్ కార్డులతో పాటు ఇంటి స్థలాలు, సంక్షేమ పథకాలు కూడా అత్యంత పారదర్శకంగా అందిస్తున్నామని చెప్పారు. విభిన్న ప్రతిభావంతులకు ల్యాప్‌టాప్‌లు, వీల్‌చైర్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రత్నకుమార్, 4వ జిల్లా అదనపు న్యాయమూర్తి రామ్‌గోపాల్, అడిషనల్ ఎస్పీ శ్రీనివాసరావు, డీఆర్డీఏ పీడీ హరిహరనాథ్ పాల్గొన్నారు.

సేవలు మెరుగ్గా.. లక్ష్యం దిశగా

- బాపట్ల జిల్లా రిజిస్ట్రేషన్ శాఖలో ఉత్తమ ఫలితాలు
- బాపట్ల జిల్లా వార్షిక టార్గెట్ రూ.196.39 కోట్లు
- డిసెంబర్ నాటికి రూ.135.86 కోట్లు



బాపట్ల సబ్ రిజిస్ట్రారు కార్యాలయం

బాపట్ల అర్బన్: బాపట్ల జిల్లాగా అవతరించాక ప్రజలకు అందే సేవల్లో అనేక మెరుగైన మార్పులు చోటుచేసుకున్నాయి. అన్ని జిల్లా ప్రభుత్వ కార్యాలయాలు బాపట్ల కేంద్రానికి తరలివచ్చాయి. ఇందులో భాగంగా జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం కూడా ఇక్కడే కొలువైంది. బాపట్ల జిల్లా పరిధిలో 12 సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉన్నాయి. భావపురికి జిల్లా హోదా వచ్చాక భూముల ధరలకు రెక్కలొచ్చాయి. దీంతో రియల్ ఎస్టేట్ వ్యాపారం ఊపందుకుంది. బాపట్ల జిల్లా పరిధిలో 2022 ఏప్రిల్ నుంచి 2023 మార్చి వరకు రూ.196.39 కోట్లు లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. దీనిని అధిగమించేందుకు రిజిస్ట్రేషన్ శాఖ ప్రత్యేక ప్రణాళిక రూపొందించుకుంది. ప్రజలకు రిజిస్ట్రేషన్ల శాఖ ద్వారా అందే సేవలను వివరిస్తూ తాజాగా అవి ఎంత సులభతరంగా పొందవచ్చో అవగాహన కల్పిస్తోంది. ఈ ప్రణాళిక మంచి ఫలితాలు ఇస్తోందని జిల్లా అధికారులు చెబుతున్నారు. 2022 డిసెంబర్ వరకు బాపట్ల జిల్లా పరిధిలోని వివిధ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల ద్వారా సమకూరిన ఆదాయం వివరాలు. ఇలా ఉన్నాయి.

భట్టిప్రోలు	రూ.4.45 కోట్లు
చెరుకుపల్లి	రూ.6.37
కొల్లూరు	రూ.7.48
అమృతలూరు	రూ.2.83
పిట్టలవానిపాలెం	రూ.3.97
రేపల్లె	రూ.14.30
బాపట్ల	రూ.23.11
అద్దంకి	రూ.21.64
చీరాల	రూ.30.26
ఇంకొల్లు	రూ.6.33
మార్టూరు	రూ.11.15
పర్చూరు	రూ.3.92

డిసెంబర్ నాటికి వచ్చిన ఆదాయం రూ.135.86 కోట్లు



బాపట్ల జిల్లాలో 12 రిజిస్ట్రారు కార్యాలయాలు ఉన్నాయి. ప్రజలకు రిజిస్ట్రేషన్‌పై గ్రామ సభల ద్వారా అవగాహన కల్పిస్తున్నాం. అగ్రిమెంట్లకే పరిమితం కాకుండా రిజిస్ట్రేషన్ చేసుకున్న పక్షంలో ఆస్తులకు భద్రత, చట్టబద్ధత చేకూరుతుంది. 2023 మార్చినాటికి జిల్లాకి ఇచ్చిన లక్ష్యాన్ని పూర్తి చేయగలుగుతామని ఆశిస్తున్నాం.

– గుత్తా లక్ష్మి, బాపట్ల జిల్లా రిజిస్ట్రార్

వృద్ధో రక్షతి రక్షితః

వృద్ధాప్యం.. ప్రతి మనిషి జీవితంలో ఓ అనివార్య దశ. అప్పుడు పిల్లలపై ఆధారపడక తప్పని క్లిష్ట పరిస్థితి. ఈ దశలో వారిని ఎంత ప్రేమగా చూసుకుంటే ఆ ప్రభావం మన పిల్లలపై అంత బలంగా పడుతుంది. మన ఆఖరి దశలో వారు అంతకంటే బాగా చూసుకునే వీలుంటుంది. ఇది ఒక జీవన చక్రం. మనం మన తల్లిదండ్రులతో ఎలా మెలుగుతామో.. మళ్లీ మనకు అదే పరిస్థితి పిల్లల నుంచి ఎదురయ్యే రోజు వస్తుందని ప్రతిఒక్కరూ గుర్తుంచుకోవాలి.

– గుంటూరు డెస్క్

- 'కనిపెంచే' దైవాలు అమ్మానాన్నలు
- ఆఖరి దశలో వారి సేవే మహాభాగ్యం
- వయోధికులకు భరోసానివ్వాలి
- మలిదశలో అదే మనకు రక్ష

అమ్మ జీవం పోస్తే ఆ జీవనానికి జీవితం ఇచ్చేది నాన్న. తల్లి తన ప్రేమను బిడ్డపై కురిపిస్తే, ఆ బిడ్డకు ఏ కష్టం రాకుండా చూసుకునే వాడే తండ్రి. బిడ్డల భవిష్యత్తు కోసం తల్లిదండ్రులు ఎన్నో త్యాగాలు చేస్తారు. పిల్లల జీవితం సంతోషంగా ఉండాలని తమ ఇష్టాలను వదిలి, కష్టాలను మరిచిపోతారు. అలా ఒకరు బతుకునిస్తే.. మరోకరు బతకడానికి దారి చూపిస్తారు. తమకు లేని ఆనందం.. ఆస్తి.. చదువు తమ పిల్లలకు ఇవ్వాలని నిత్యం పరితపిస్తారు. దంపతుల్లో ఒకరు కాలం చేసినా మిగిలిన వారు మరో పెళ్లి చేసుకోకుండా పిల్లలను అన్నీ తామై కంటికి రెప్పలా కాపాడుకుంటారు. సర్వస్వం ధారపోసి తమ ప్రతిరూపాలను ఉన్నతంగా నిలబెట్టడానికి కొవ్వొత్తిలా కరిగిపోయే అమృతతుల్యులు వారు. అందుకే తల్లిదండ్రులను ప్రత్యక్ష దైవాలు అంటారు.

వయోభారం, బిడ్డల దూరం.. చింతకు కారణం

నేటి సమాజంలో కన్నబిడ్డలు కలల కొలువుల కోసం రెక్కలు కట్టుకొని ఎగిరిపోతే ఎందరో తల్లిదండ్రులు ఒంటరిగా జీవితాలు వెళ్లదీస్తున్నారు. కొందరు పిల్లలు వేరింటి కాపురాలతో కన్నవారిని విస్మరిస్తున్నారు. ఆస్తులు పంచి ఇవ్వాలంటూ వేధింపులకు గురిచేస్తున్నారు. ఉమ్మడి కుటుంబాల విచ్ఛిన్నం, కన్నబిడ్డల స్వార్థం, మానవ విలువలు లోపించడం వంటివి ప్రస్తుతం వృద్ధ తల్లిదండ్రులకు శాపంగా మారాయి. వయసుడిగిన సమయంలో ఆస్తుల కోసమో,. చాదస్తం అంటూనో ఇంటి నుంచి వారిని గెంటివేయడం లేదా నిరాదరించడం దారుణం.

విలాసాలు ఆనందాన్నివ్వవు

వృద్ధుల సంక్షేమం కోసం ప్రభుత్వాలు ఎన్ని చట్టాలు చేసినా వాటి అమల్లో నేటికీ సరైన ఫలితాలు కనిపించడం లేదన్నది వాస్తవం. నిత్యం ఎందరో వృద్ధులు నిరాదరణకు గురవుతున్నారు. విలాసమైన భవనాలు, పుష్కలంగా డబ్బు, ఇంట్లో పనివారు ఉన్నా ఇవన్నీ తల్లిదండ్రులకు ఎలాంటి ఆనందాన్ని ఇవ్వవు. వద్ధాశ్రమంలో ఎన్ని వసతులు కల్పించినా ప్రతినెలా డబ్బులు పంపించినా సంతోషం ఉండదు. ఆశ్రమంలో ఎందరు పక్కన ఉన్నా సొంతవారు కానరాకుంటే హృదయం ద్రవిస్తూనే ఉంటుంది. కుటుంబ సభ్యులు వదిలాశారని కొందరు వృద్ధాశ్రమల్లో మగ్గుతుండగా,, మరికొందరు దిక్కుమొక్కులేని అనాథలుగా సమాజంలో భిక్షాటన చేస్తూ దీనస్థితిలో బతుకులీడుస్తున్నారు. కలిగిన కుటుంబాలకు చెందిన వారైతే ఆర్థిక, అనారోగ్య సమస్యలను తట్టుకోలేక ఆత్మహత్యలు చేసుకుంటున్న సందర్భాలు అనేకం. పెద్దలు చాదస్తం, అనారోగ్యం, మతిస్థిమితం లేక విసిగిస్తున్నారని వారి వద్ద ఆస్తిపాస్తులు రాయించుకుని వీధుల్లో శ్మశానాల్లో వదిలేయడం దారుణమే కాదు.. మహాపాపం..



కన్నతండ్రిపై కర్కశం

'గుంటూరు జిల్లాకు చెందిన మల్లికార్జునరావుకు భార్య, ఇద్దరు కుమార్తెలు. శక్తి ఉన్నంత కాలం కుమార్తెల కోసం ఎంతో కష్టపడ్డారు. ప్రస్తుతం పక్షవాతం రావడం, వృద్ధాప్యంతో తన పనులు కూడా తాను చేసుకోలేని స్థితిలో ఉండటంతో భారమెందుకనుకున్నారో ఏమో ఆ కుమార్తెలు కన్నతండ్రిపై కర్కశంగా వ్యవహరించారు. బతికుండగానే శ్మశానంలో వదిలేసి వెళ్లారు. నిస్సహాయ స్థితిలో పడి ఉన్న ఆయనను ఓ స్వచ్ఛంద సంస్థ సభ్యులు వృద్ధాశ్రమానికి తరలించి సపర్యలు చేస్తున్నారు.''

దత్తపుత్రుడి దుర్నీతి

పల్నాడుకు చెందిన నాగేశ్వరరావు, సావిత్రమ్మ దంపతులకు పెళ్లై ఏళ్లు గడిచినా సంతానం సిద్ధించలేదు. ఎన్ని దానధర్మాలు చేసినా.. మొక్కులు మొక్కినా ఫలితం శూన్యం. దీంతో ఓ అనాథ బాలుడిని దత్తత తీసుకున్నారు. అల్లారుముద్దుగా పెంచారు. మరో అనాథను ఇచ్చి పెళ్లి చేసి మానవత్వం చాటుకున్నారు. ఇల్లు, పొలాలు వారిపేద రాశారు. అయినా ఆ దత్త పుత్రుడు వారిని ఆదరించలేదు. పెద్దలిద్దరినీ వృద్ధాశ్రమానికి తరలించాడు. దాతల ఉదారతే ఆశ్రమంలో ఉన్న వారి ఆకలికి పరమాన్నమైంది.

పిల్లలు దూరమై.. వేదన

బాపట్లకు చెందిన రామయ్య చిన్నప్పుడు పెద్దగా చదవలేదు. కానీ విద్యవిలువ తెలుసు. అందుకే భార్య సీత చెప్పినా వినకుండా కొడుకు, కూతురు హరిష్, హరితను చదివించాడు. గొప్పింటి సంబంధాలను చూసి పెళ్లిళ్ల చేశాడు. ఇద్దరూ సాఫ్ట్ వేర్‌లే. అమెరికాలో స్థిరపడ్డారు. ఇప్పుడు వయసుడిగిన వృద్ధ తల్లిదండ్రులు బిడ్డలు దగ్గరలేక తీరని వేదన అనుభవిస్తున్నారు. అలాగని బిడ్డలు వారిని వదిలేయలేదు. వీడియో కాల్స్‌లో నిత్యం మాట్లాడుతున్నారు. అన్నింటినీ సమకూరుస్తున్నారు. అయినా వారిలో ఆనందం లేదు. కన్న బిడ్డల దగ్గర గడపాలన్న ఆశ వారిది.

సర్దుకుపోతే సంతోషాలే..

వృద్ధాప్యంలో సగటు మనిషి కోరుకునేవి ఏమీ ఉండవు. వేళకు ఇంత తిండి, అనారోగ్యానికి సంబంధించిన మాత్రలు అందిస్తూ చెంత కూర్చొని కొద్దిసేపు ప్రేమగా పలకరిస్తే చాలు. జీవిత చరమాంకంలో అంతకంటే స్వాంతన, ప్రశాంతత ఏముంటాయి. తల్లిదండ్రులు విసిగిస్తే వారిని పిల్లల్లానే భావించాలి. ఇంట్లో పిల్లలు ఎంత అల్లరి చేసినా విసుగు ఉంటుందా.. ఉండదు కదా.. అలాగే వృద్ధులనూ ఆదరించాలి. వారితో ప్రేమగా మాట్లాడాలి. ముఖ్యంగా కోడళ్ల ప్రవర్తనలో మార్పు రావాలి. అత్తమామలను తల్లిదండ్రులుగానే చూడాలి. మనతో ఎన్నాళ్లుంటారో తెలీదు.. ఆఖరి దశలో ప్రేమగా చూసుకోవాలి. మనిషి పోయాక బాధపడేకంటే ముందు బాగా చూసుకుంటే మనకూ ప్రశాంతత లభిస్తుంది. అలాగే తల్లిదండ్రులూ పిల్లలపై పెత్తనం చలాయించడం, కోడళ్లపై దురుసుగా ప్రవర్తించడం వంటివి మానుకోవాలి. సర్దుకుపోతే అంతా మంచే జరుగుతుంది. ఓర్పు, నేర్పుతో మనవళ్లు, మనవరాళ్లతో కాలక్షేపం చేస్తూ లౌక్యంగా వ్యవహరిస్తే చాలా వరకు కుటుంబ సమస్యలను పరిష్కరించవచ్చు. వృద్ధాశ్రమాలతో పనే ఉండదు. సర్వేజనా సుఖినో భవంతి.



నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

కలెక్టర్ విజయకృష్ణన్



చినగంజాం: అధికారులు నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ విజయకృష్ణన్ హెచ్చరించారు. చినగంజాం మండలంలోని పల్లెపాలెం, కడవకుదురు, సంతరావూరు గ్రామాల్లో కలెక్టర్ శనివారం విస్తృతంగా పర్యటించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏఎన్ఎంల సెక్టార్ సమావేశంలో పాల్గొని పౌష్టికాహార మాసోత్సవాల్లో గర్భిణులకు సీమంతం నిర్వహించారు. అమృత్ సరోవర్ కార్యక్రమంలో భాగంగా అభివృద్ధి పనులను పరిశీలించి కలెక్టర్ మొక్కలు నాటారు. పల్లెపాలెం గ్రామంలోని జగనన్న కాలనీని ఆమె పరిశీలించి 34 గృహాలు మంజూరు కాగా 17 మాత్రమే నిర్మాణం కాగా మిగిలినవి మొదలు కాకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. పల్లెపాలెంలో 486 మంది రైతులకు చెందిన 1466 ఎకరాలు గ్రామ పరిధిలో ఉండగా ఇప్పటి వరకు 1240 ఎకరాలను 78 శాతం ఈ–క్రాప్ నమోదు చేసినట్లు అధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. మోటుపల్లిలో చిన్నారులు ఎత్తుకు తగిన బరువు లేకపోవడం పోషణలోపానికి గురవడంతో ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. మెరుగైన సమాజం కోసం ప్రభుత్వం కృషి చేస్తున్నప్పటికీ క్షేత్రస్థాయి సిబ్బంది నిబద్ధతతో పనిచేయడం లేదని ఆమె అసహనం వ్యక్తం చేశారు. అన్నృత సరోవర్‌లో భాగంగా సంతరావూరులో రూ.2.5 లక్షలతో అభివృద్ధి చేసిన 9 ఎకరాల చెరువును పరిశీలించి మొక్కలు నాటారు. కార్యక్రమంలో చీరాల ఆర్డీఓ పి.సరోజిని, డ్వామా పీడీ వై.శంకర్ నాయక్, హౌసింగ్ పీడీ ప్రసాద్, పీఆర్ ఎస్ఈ శ్రీనివాసులు, వ్యవసాయశాఖ జేడీ అబ్దుల్ సత్తార్, డ్వామా ఏపీడీ భవాని, ఎంపీడీవో విజయలక్ష్మి, ఇన్‌చార్జి తహసీల్దార్ బ్రహ్మయ్య, ఈవోపీఆర్డీ కె.స్వరూపరాణి, హౌసింగ్ ఏఈ రాజశేఖర్, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ రామ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలు ఘనత సీఎం జగన్‌దే

ఎంపీ మోపిదేవి వెంకట రమణారావు



నిజాంపట్నంలో మహిళామార్ట్‌ను ప్రారంభిస్తున్న ఎంపీలు సురేష్, మోపిదేవి

రేపల్లె రూరల్: ఇచ్చిన మాటకు కట్టుబడి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తూ రాష్ట్ర ప్రజలకు అండగా నిలుస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు అన్నారు. బాపట్ల జిల్లా రేపల్లెలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పాదయాత్ర సమయంలో జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలను నూరుశాతం అమలు చేసిన నాయకుడిగా నిలిచారన్నారు. నేడు పప్పు బాబు లోకేష్ కుప్పం నుంచి ప్రారంభించిన హైబ్రిడ్ పాదయాత్ర స్వచ్ఛందంగా తిరుపతి వరకైనా చేరుతుందా అని సందేహం వ్యక్తం చేశారు. 2014లో చంద్రబాబు పాదయాత్ర చేసిన సమయంలో ఇచ్చిన హామీలను ఏ మేరకు అమలు చేశారో లోకేష్ ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. సచివాలయ వ్యవస్థ ద్వారా రెండు లక్షల ఇరవై ఐదు వేల మందికి శాశ్వత ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించిన ఘనత సీఎం జగన్‌దేనన్నారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే దేవినేని మల్లికార్జునరావు, చైర్‌పర్సన్ కట్టా మంగ, వైస్‌చైర్మన్‌లు గుజ్జర్లమూడి ప్రశాంత్ కుమార్, తూనుగుంట్ల కాశీవిశ్వనాథ గుప్త, కౌన్సిలర్ లక్ష్మీ ప్రసన్న పాల్గొన్నారు.

మహిళా మార్ట్‌లతో ఉపాధి అవకాశాలు

నిజాంపట్నం: మహిళలకు తగిన ప్రాధాన్యం ఇస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిదే అని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు పేర్కొన్నారు. నిజాంపట్నంలో చేయూత మహిళా మార్ట్‌ను బాపట్ల ఎంపీ నందిగం సురేష్‌తో కలసి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మోపిదేవి మాట్లాడుతూ ప్రతి డ్వాక్రా మహిళకు లబ్ధి చేకూరే విధంగా మహిళా మార్ట్‌ను ఏర్పాటు చేయడం జరుగుతుందని చెప్పారు. బాపట్ల జిల్లాలో మొట్టమొదటి సారిగా నిజాంపట్నంలోనే ఈ మార్ట్‌ను ప్రారంభించినట్లు తెలిపారు. బాపట్ల ఎంపీ నందిగం సురేష్ మాట్లాడుతూ మహిళా మార్ట్ వలన కొనుగోలు చేసే లబ్ధిదారునికి కలిగే ప్రయోజనాన్ని విస్తృత ప్రచారం ద్వారా మార్ట్ అభివృద్ధి చెందేందుకు కృషి చేయాలని చెప్పారు. తొలుత మహిళా మార్ట్‌ను, మార్కెట్ యార్డు భవనాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే దేవినేని మల్లికార్జునరావు, రేపల్లె ఆర్డీఓ జె.పార్థసారథి, ప్రాజెక్ట్ డైరెక్టర్ అర్జునరావు, మార్కెట్ యార్డు జేడీ శ్రీనివాసరావు, ఖాజావలి, జెడ్పీటీసీ సభ్యురాలు నర్రా సుబ్బయ్య, ఎంపీపీ మోపిదేవి విజయనిర్మల హరనాథబాబు, మాజీ ఎంపీపీ ప్రసాదం వాసుదేవ, నాజర్‌ఖాన్, బోటుక నర్స్ యూనియన్ అధ్యక్షుడు కన్నా శ్రీనివాసరావు, తహసీల్దార్ శిరీష, ఎంపీడీఓ నాగలక్ష్మి పాల్గొన్నారు.

ఖేల్ ఇండియా పోటీలకు 15మంది విద్యార్థులు

15 మందిలో ఎనిమిది మంది క్రీడాకారులు పంగులూరు నుంచే



షాలేమ్‌రాజు, మంత్రునాయక్, నాని, కోరేష్, ఫణికుమార్, వంశీ, మహేష్, సూరినాయుడు

జే.పంగులూరు: మధ్యప్రదేశ్‌లోని జబల్‌పూర్‌లో జాతీయస్థాయి ఖేలో ఇండియా పోటీలు ఈ నెల 30 నుంచి ఫిబ్రవరి 3వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు రాష్ట్ర ఖోఖో కార్యదర్శి మేకల సీతారామిరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పోటీలకు అండర్-19 విభాగంలో ఉమ్మడి ప్రకాశం జిల్లా నుంచి 8 మంది క్రీడాకారులు ఎంపికైనట్లు తెలిపారు. వీరిలో నలుగురు క్రీడాకారులు పంగులూరు స్థానిక మాగుంట సుబ్బరామిరెడ్డి, బాచిన నారాయణమ్మ జూనియర్ కళాశాల విద్యార్థులు, ఎస్ఆర్ఆర్ ఖోఖో అకాడెమీ నుంచి నలుగురు క్రీడాకారులు జాతీయ జట్టుకు ఎంపిక కావడం చాలా సంతోషంగా ఉందని సీతారామిరెడ్డి తెలిపారు. జట్టులో మొత్తం 15 మందిలో 8 మంది పంగులూరు నుంచి ఎంపిక కావటంపై రాష్ట్ర ఖోఖో అసోసియేషన్ చైర్మన్ బాచిన చెంచు గరటయ్య, రాష్ట్ర ప్రెసిడెంట్ టీఎస్ఆర్‌కే ప్రసాద్, ఏపీ శాప్ నెట్ చైర్మన్, అద్దంకి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్య, జెడ్పీటీసీ ప్రమీల, మండల అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు ఆర్.వెంకటసుబ్బారావు, సర్పంచి గుడిపూడి నాగేంద్రం రామారావు అభినందించారు.

పోటీలకు ఎంపికైన విద్యార్థులు..

ఎస్.షాలోమ్‌రాజు (పంగులూరు) సీఈసీ రెండో సంవత్సరం, ఆర్.మంత్రునాయక్ (పంగులూరు) సీఈసీ మొదటి సంవత్సరం, జి.నాని (పంగులూరు) సీఈసీ రెండో సంవత్సరం, ఏ కోరేష్ (పంగులూరు) సీఈసీ రెండో సంవత్సరం విద్యార్థులు ఎంపికయ్యారు. ఎం. ఫణికుమార్(పంగులూరు), కే వంశీ(పంగులూరు), కే మహేష్(పంగులూరు), ఆర్.సూరినాయుడు(పంగులూరు) క్రీడాకారులు ఎంపికయ్యారు.

ఇటుక ఉత్పత్తిదారులు నిబంధనలు పాటించాలి

జిల్లా ఇన్‌చార్జి లేబర్ కమిషనర్ శివప్రసాద్

కొల్లూరు: ఇటుక పరిశ్రమలో పనిచేయడానికి వచ్చిన వలస కార్మికుల విషయంలో పరిశ్రమ నిర్వాహకులు కార్మిక చట్టాలకు లోబడి పనిచేయించుకోవాలని, అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా ఇన్‌చార్జి లేబర్ కమిషనర్ డి.శివప్రసాద్ హెచ్చరించారు. పోతార్లంక సమీపంలో అగ్ని ప్రమాదం కారణంగా నిర్వాసితులైన వలస కార్మికుల జీవన స్థితిగతులను శనివారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన ఇటుక ఉత్పత్తిదారులు, వలస కూలీలకు కార్మిక చట్టాల గురించి అవగాహన కల్పించారు. ఇటుక బట్టీల నిర్వాహకులు తప్పనిసరిగా వలస కూలీలకు తగిన సౌకర్యాలు కల్పించడంతో పాటు, సురక్షితమైన నివాస సదుపాయాన్ని ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కూలీలకు చెల్లించే నగదును మధ్యవర్తుల ద్వారా చెల్లించడం చట్టవిరుద్ధమని, వారు చేసిన పనికి చెల్లించే కూలి డబ్బు వారి బ్యాంక్ ఖాతాల ద్వారా చెల్లింపు చేయాలని చెప్పారు. ఇటుక ఉత్పత్తిదారులు వలస కూలీల విషయంలో నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తే కేసులు నమోదు చేయడం జరుగుతుందని హెచ్చరించారు. వలస కార్మికుల పిల్లలు ఆయా గ్రామాల పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలకు వెళ్లేందుకు అవసరమైన ఏర్పాట్లు పరిశీలించనున్నట్లు చెప్పారు. ఇతర రాష్ట్రాల నుంచి వలస కూలీలను తీసుకువచ్చే ఇటుక ఉత్పత్తి దారుల వద్ద సంబంధిత అనుమతులు లేని పక్షంలో కఠిన చర్యలు చేపడతామన్నారు. నిర్వాసితులైన వలస కార్మికులకు ఇటుక బట్టీ నిర్వాహకుడు కృష్ణారెడ్డి, సహృదయ ఫౌండేషన్ వారు సమకూర్చిన వంట పాత్రలు, నిత్యావసరాలను ఆయన పంపిణీ చేశారు. కార్యక్రమంలో రేపల్లె అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ వి.సాయిజ్యోతి, తహసీల్దార్ ఎ.శ్రీనివాసరావు, తోకలవారిపాలెం సర్పంచి టి.కృష్ణమోహన్ పాల్గొన్నారు.

జర్నలిస్టుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

రాష్ట్ర ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాసరావు



గ్రంథాలయ అధ్యక్షుడికి పుస్తకాలు అందిస్తున్న చైర్మన్ శ్రీనివాసరావు

వేటపాలెం: రాష్ట్రంలో జర్నలిస్టుల సంక్షేమం కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు పేర్కొన్నారు. బాపట్ల జిల్లా వేటపాలెం మండలంలోని సారస్వత నికేతన గ్రంథాలయాన్ని ఆయన శనివారం సందర్శించారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో జర్నలిస్టులకు ఇళ్ల పట్టాల పంపిణీ ప్రభుత్వ పరిశీలనలో ఉందని తెలిపారు. ఆరోగ్య బీమా సౌకర్యం కల్పిస్తామని చెప్పారు. అనంతరం గ్రంథాలయ కార్యవర్గం చైర్మన్ కొమ్మినేనిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బాపట్ల జిల్లా పౌరసంబంధాల శాఖ అధికారి టీ మోహన్‌రాజు ఉన్నారు.

వేటపాలెం గ్రంథాలయం తెలుగుజాతికి స్ఫూర్తి

వేటపాలెంలోని సారస్వత నికేతనం గ్రంథాలయం మహాత్మా గాంధీలాంటి ఎందరో గొప్పవాళ్లు సందర్శించడం తెలుగు జాతికి స్ఫూర్తినిచ్చిందని రాష్ట్ర ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు పేర్కొన్నారు. శనివారం వేటపాలెం సారస్వత నికేతనం గ్రంథాలయాన్ని ఆయన సందర్శించారు. ఆంధ్రప్రదేశ్ ప్రజాతీర్పు, ఆంధ్రప్రదేశ్ శాసనసభ సామాజిక వర్గాలు, తెలంగాణ ఆవిర్భావ పాత్రదారులు సూత్రదారులు అనే అంశాలపై చైర్మన్ రచించిన పుస్తకాలను గ్రంథాలయానికి అందజేశారు. కార్యక్రమంలో పౌరసంబంధాల అధికారి టీ మోహన్ రాజు, గ్రంథాలయ ఇన్‌చార్జి అధ్యక్షుడు కే శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్రకృతి వైపరీత్యాల్లో ఆపద మిత్రల సేవలు

బాపట్ల ఈటీసీ ప్రిన్సిపాల్ శ్రీనివాసరెడ్డి

వేటపాలెం: ప్రకృతి వైపరీత్యాలు సంభవించిన సమయాల్లో ప్రజలను కాపాడటానికి ఆపదమిత్ర వలంటీర్ల సేవలు వినియోగంలోకి తీసుకొస్తున్నట్లు బాపట్ల ఈటీసీ ప్రిన్సిపాల్ కే శ్రీనివాసరెడ్డి తెలిపారు. బాపట్ల జిల్లా వేటపాలెం మండలం రామాపురంలో ప్రకృతి వైపరీత్యాల నిర్వహణ ఏపీఎస్‌డీఎంఏ, ఏపీ ఎస్ఐఆర్‌డీ పీఆర్ ఆధ్వర్యంలో ఆపదమిత్ర వలంటీర్లకు శిక్షణ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా లక్ష మంది ఆపద మిత్రలకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామన్నారు. అందులో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా 5,400 మంది, బాపట్ల జిల్లాలో 300 మందికి 12 రోజుల పాటు ప్రత్యేక శిక్షణ ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. శిక్షణలో 21 శాఖలకు సంబంధించిన అధికారుల సమన్వయంతో పనిచేస్తుంటారని తెలిపారు. తుఫాన్, ప్రకృతి వైపరీత్యాలు, అగ్ని ప్రమాదాల వంటి సమయంలో ప్రమాదంలో ఉన్నవారిని ఎలా రక్షించాలో వంటీర్లకు ప్రత్యేక శిక్షణ ఇస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీవో శర్మ, ఏపీఎం శ్రీనివాసులు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

శ్రీకృష్ణపాండవీయం ఒక కళాఖండం

సినీ సాహితీ విశ్లేషకుడు వారణాశి రఘురామశర్మ

అద్దంకి: శ్రీకృష్ణ పాండవీయం చిత్రం ఒక కళాఖండమని సినీ సాహితీ విశ్లేషకుడు వారణాశి రఘురామ శర్మ అన్నారు. 'ప్రతిభా మూర్తులు, అపురూప చిత్రాలు' కార్యక్రమాన్ని రిటైర్డ్ బ్యాంకు మేనేజర్ రావూరి రంగయ్య సౌజన్యంతో, కేర్ అండ్ క్యూర్ హోమియో వైద్యశాల ఆవరణలో కట్టా రామకోటేశ్వరరావు స్మారక వేదికపై శనివారం రాత్రి ఏపీఎస్ఆర్టీసీ రిటైర్డు ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. వెండితెర నటి జమున, హేతువాది రావిపూడి వెంకటాద్రి మృతికి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమానికి రిటైర్డు ఆర్జేడీ యూ దేవపాలన అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా రఘురామశర్మ మాట్లాడుతూ చిత్రంలోని ఒక పాటలో మత్తు వదలరా నిద్దుర మత్తు వదలరా.. అనే పాట మనిషి కర్తవ్యాన్ని తట్టి లేపినట్లు ఉంటుందని వివరించారు. కార్యక్రమంలో జాషువా కళాసమితి అధ్యక్షుడు పీసీహెచ్ కోటయ్య, జ్యోతి చంద్రమౌళి, చెన్నుపాటి రామాంజనేయులు, సాహితీ విశ్లేషకుడు అన్నంనేని వెంకట్రావు, అద్దంకి లెవీ ప్రసాద్, శేషగిరి, లక్కరాజు శ్రీనివాసరావు, ఆర్వీ రాఘవరావు, గాడేపల్లి దివాకరదత్తు, ఎస్‌కే ఎండీ రఫీ, కూరపాటి రామకోటేశ్వరరావు, చప్పిడి వీరయ్య పాల్గొన్నారు.

చిరుధాన్యాల సాగు చేపట్టాలి

పేరలి(కర్లపాలెం): రైతులు చిరుధాన్యాల సాగుపై దృష్టి సారించాలని బాపట్ల జిల్లా వ్యవసాయాధికారి అబ్దుల్ సత్తార్ తెలిపారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పేరలి గ్రామంలో చిరు ధాన్యాల సాగుపై రైతులకు అవగాహన సదస్సు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా అబ్దుల్ సత్తార్ మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా చిరుధాన్యాల వినియోగం పెరుతుందని పేర్కొన్నారు. మార్కెట్‌లో చిరుధాన్యాలకు బాగా డిమాండ్ ఉందని రైతులకు తెలిపారు. చిరు ధాన్యాలను ఆహారంగా తీసుకోవాలని వాటిలో విలువైన పోషకాలు ఉన్నాయని రైతులకు చెప్పారు. చిరుధాన్యాలను పండించాలని రైతులు పండించే ప్రతి గింజను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని రైతులకు భరోసానిచ్చారు. ఏడీఏ ఎ.లక్ష్మి మాట్లాడుతూ రబీ సీజన్‌కు రైతులు చిరు ధాన్యాలను పండించాలని ఆమె సూచించారు. మార్కెట్‌లో డిమాండ్ ఉన్న రకాలను పండించటం ద్వారా ఆర్థికంగా అభివృద్ధి సాధించవచ్చునన్నారు. ప్రభుత్వం చిరు ధాన్యాల సాగును ప్రోత్సహిస్తోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీడీఏ విజయనిర్మల పాల్గొన్నారు.

చిన్న మొత్తాల పొదుపుతో అధిక ప్రయోజనాలు

అద్దంకి రూరల్: చిన్న మొత్తాల పొదుపుతో లబ్ధిదారులకు అధిక ప్రయోజనాలు చేకూరుతున్నాయని రాష్ట్ర పోస్టల్ శాఖ ఏడీజీ సతీష్ అన్నారు. శనివారం స్థానిక పోస్టాఫీస్‌కు విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అద్దంకి సబ్‌డివిజన్ పరిధిలో మహా మేళా ద్వారా కొత్త ఖాతాలను ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. తపాలా శాఖలో నూతనంగా ప్రవేశపెట్టిన పథకాల్లో గతంలో ఉన్న పథకాల కన్నా అధిక వడ్డీలు లభిస్తున్నాయని వెల్లడించారు. ఈ అవకాశాన్ని ఖాతాదారులు వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో విజయవాడ రీజియన్ అధికారులు, అద్దంకి ఐపీఓ లహోరి విష్ణు, శ్రీనివాసరావు, బీపీఎంలు, సిబ్బంది పాల్గొన్నారు.

జాయింట్ కలెక్టరు (వె.త. సంక్షేమశాఖ), గుంటూరు

ఆర్.సి.నెం. ఎ4/131/2022 **టెండరు ప్రకటన** తేది:28.01.2023

గుంటూరు జిల్లాలోని బి.సి. సంక్షేమశాఖ వసతిగృహములకు ప్లేట్లు & గ్లాసులు, వంటపాత్రలు మరియు ట్రంకు పెట్టెలు సరఫరా చేయుటకు సీలు టెండర్లు కోరబడుచున్నవి. ఆసక్తిగల సరఫరాదారులు షెడ్యూల్లు కొరకు రూ.1000/- లు జిల్లా బి.సి. సంక్షేమాధికారి, గుంటూరు వారి పేరున డి.డి. తీసి ది.30-01-2023 నుండి 08-02-2023 మధ్యాహ్నం గం॥ 2.00 లలోపు సీలు టెండర్లు పొందవచ్చును. ఈ టెండరు సడలింపులు మరియు రద్దుపరచు అధికారము శ్రీయుత సంయుక్త కలెక్టరు / చైర్మన్, జిల్లా కొనుగోలు కమిటి వారికి కలదు. తదుపరి వివరములకు సంప్రదించవలసిన ఫోన్ నెం. 9440928077 & 7799357555.

సం/- జిల్లా జాయింట్ కలెక్టరు/ చైర్మన్,
జిల్లా కొనుగోలు కమిటి, గుంటూరు వారి తరపున